Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANIVARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue): 355 పేజీలు (Pages): 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 12 - 6 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

# 11 ఏళ్లు, 33 తప్పిదాలు.. మోదీ సర్కార్‌పై మండిపడిన ఖర్గే



**కలబురగి:** కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా కాంగ్రెస్ పార్టీని విడగొట్టేందుకు మోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం కుట్ర పన్నిందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. వాల్మీకి కార్పొరేషన్ కుంభకోణానికి సంబంధించి బళ్లారి ఎంపీ, ముగ్గురు ఎమ్మెల్యేలపై ఈడీ దాడులను ఖర్గే బుధవారంనాడిక్కడ జరిగిన మీడియా సమావేశంలో ప్రస్తావించారు. ఈడీ దాడుల ద్వారా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలను బీజేపీ టార్గెట్ చేసిందని, అయినప్పటికీ మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి చీలికలు తేలేదని, పార్టీ ఐక్యంగా ఉందని చెప్పారు. నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలన కేవలం అబద్ధాలు, యువకులను మోసం చేయడానికే పరిమితమైందని ఖర్గే ఆరోపించారు. '11 ఏళ్లలో 33 తప్పిదాలు చేశారు. పార్లమెంటులో కూడా నేను ఇదే మాట చెప్పిన సంగతి అందరికీ తెలుసు. ఓట్ల కోసం అబద్ధాలు చెప్పడం, యువకులను మోసం చేయడం, పేదలను కడగండ్లపాలు చేస్తున్న ఇలాంటి ప్రధానికి నా రాజకీయ జీవితంలోనే చూడలేదు' అని ఖర్గే ఘాటుగా విమర్శించారు.

**డిప్యూటీ స్పీకర్ మాటేంటి?**

లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవిని భర్తీ చేయకుండా ఖాళీగానే ఉంచడంపై ప్రభుత్వాన్ని ఖర్గే నిలదీశారు. ప్రధాన విపక్ష పార్టీకి ఆ పదవి దక్కాల్సి ఉందని చెప్పారు. ఆ ఖాళీని భర్తీ చేయకపోవడం చట్టవిరుద్ధమని, విపక్షాలకు చిన్న పోస్ట్ కూడా మోదీ ఇవ్వడం లేదని అన్నారు. ప్రజాస్వామ్యం పట్ల ఆయనకు నమ్మకం లేదనడానికి ఇదే నిదర్శమని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి మోదీకి లేఖ కూడా రాసినట్టు చెప్పారు. కర్ణాటక మహర్షి వాల్మీకి ఎస్‌టీ డవలప్‌మెంట్ కార్పొరేషన్‌పై సమగ్ర దర్యాప్తు జరిగేంత వరకూ తమ పార్టీ ఎలాంటి వ్యాఖ్యలు చేయదని ఖర్గే చెప్పారు. ఈ స్కామ్‌కు ఈడీ ఎలాంటి ట్విస్ట్ ఇస్తుందో చూడాలనుకుంటున్నామని అన్నారు. నిధుల దుర్వినియోగం అంశ ఈడీకే వదిలిపెడుతున్నామని, కేసు విచారణలో తాము జోక్యం చేసుకోవమని తెలిపారు. ఎన్నికల్లో ఎవరు, ఎంతెంత ఖర్చుపెట్టారో అందరికీ తెలుసునని, ఈడీ దాడులు కొత్తేమీ కాదని, ఇలాంటి దాడులతో కాంగ్రెస్ పార్టీని విడగొట్టడం మాత్రం అసాధ్యమని అన్నారు.

**మంత్రివర్గ విస్తరణ, కులగణనపై..**

కర్ణాటకలో మంత్రివర్గ విస్తరణ ఇప్పటికిప్పుడు లేదని ఖర్గే తెలిపారు. బెంగళూరులో ఇటీవల జరిగిన తొక్కిసలాట సహా పలు అంశాలపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు మంగళవారంనాడు ఢిల్లీలో రాహుల్ సమక్షంలో చర్చించినట్టు చెప్పారు. కర్ణాటకలో మళ్లీ కులగణన చేపట్టాలని తీసుకున్న నిర్ణయాన్ని ఖర్గే సమర్ధించారు. కులగణనలో సోషియా-ఎకనామిక్ క్రయిటీరియాను ఇప్పటికే ప్రభుత్వం పాటిస్తోందని, ఇందులో చోటు చేసుకోని మరో క్రయిటీరియాను కొత్త సర్వేలో చేర్చాల్సి ఉంటుందని చెప్పారు. బెంగళూరులో తొక్కిసలాటకు బాధ్యత వహిస్తూ సిద్ధరామయ్య రాజీనామాకు బీజేపీ డిమాండ్ చేయడంపై అడిగినప్పుడు, ఈ ఏడాది మొదట్లో కుంభమేళాలో విషాదం చోటు చేసుకుందని, సీఎం రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. తొక్కిసలాట ఊహించలేదని, దానికి క్షమాపణ చెప్పాల్సి ఉంటుందని, బాధిత కుటుంబ సభ్యులకు తాము (ప్రభుత్వం) అండగా నిలబడమే కాకుండా భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఖర్గే చెప్పారు.

# పొదిలిలో వైఎస్ జగన్‌కు నిరసన సెగ

**ప్రకాశం జిల్లా, (రాజధాని వార్తలు):** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం నాడు ప్రకాశం జిల్లా పొదిలి పర్యటనకు వెళ్లారు. పొగాకు వేలం కేంద్రం వద్ద రైతులను పరామర్శించి వారితో మాట్లాడేందుకు అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జగన్‌కు నిరసన సెగ తగిలింది. సాక్షి టీవీలో అమరావతి మహిళలను కించపరుస్తూ డిబేట్ నిర్వహించడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పొదిలిలో అడుగడుగునా నల్ల బెలూన్లు, ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. మహిళలకు జగన్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలపై వైసీపీ మూకలు రాళ్లు, చెప్పులు విసిరారు. ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. కాగా, బుధవారం ఉదయం తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరిన జగన్ 11 గంటలకు పొదిలి చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా పొగాకు బోర్డు కార్యాలయానికి వెళ్లారు.

**చర్యలు తీసుకోవాలి...**

కాగా, రాష్ట్ర రాజధాని అమరావతి మహిళల పట్ల నీచంగా మాట్లాడిన సాక్షి ఛానల్, పేపర్‌ను మూసివేయించాలంటూ బుధవారం నాడు తెలుగుదేశం పార్టీ మహిళలు నల్లబెలూన్లతో భారీ నిరసన ర్యాలీ చేశారు. అనంతరం కందులాపురం సెంటర్‌లోని అంబేద్కర్




విగ్రహానికి వినతిపత్రం అందచేశారు. టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు తోట మహాలక్ష్మి, జడ్పీటీసీ సభ్యులు కొత్తపల్లి జ్యోతి మాట్లాడుతూ సాక్షి ఛానల్ రిపోర్టర్ కొమ్మినేని, జర్నలిస్టు కృష్ణంరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**సిగ్గుచేటు..**

మహిళలను అవమానపరిచేలా మాట్లాడినప్పటికీ ఆ ఛానల్ ఎండీ భారతిరెడ్డి ఖండించడం గానీ, క్షమాపణ చెప్పడం గానీ చేయకపోవడం సిగ్గుచేటన్నారు. మహిళలంటే గౌరవం లేకే జగన్‌రెడ్డి తల్లిని, చెల్లిని ఇంటి నుంచి గెంటేశారని మహిళలు ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కంభం టౌన్ టీడీపీ మహిళా అధ్యక్షురాలు ఆరేపల్లి సుభాషిని, అర్ధవీడు మండల నాయకురాలు కత్తి భారతి, పలువురు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాళ్ల దాడి చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షిస్తాం

## - ఏపీ మంత్రి నారా లోకేష్ తీవ్ర ఆగ్రహం

**అమరావతి, (రాజధాని వార్తలు):** మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి నారా లోకేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా పొదిలిలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలు, డ్యూటీలో ఉన్న పోలీసులపై వైసీపీ సైకోలు దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మహిళలు, పోలీసులపై రాళ్ల దాడి చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. జగన్ మోహన్ రెడ్డి మొన్న తెనాలి గంజాయి బ్యాచ్ రౌడీషీటర్లకు ఓదార్పు యాత్ర చేశారని మండి పడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా మంత్రి నారా లోకేష్ ట్వీట్ చేశారు. ఇప్పుడేమో తల్లిలా గౌరవించాల్సిన మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వారికి మద్దతుగా నిలుస్తున్నారంటూ మంత్రి లోకేష్ దుయ్యబట్టారు. జగన్ తన తల్లిని, చెల్లిని మెడపట్టి బయటకు గెంటేశారని, అలాగే వారిని కోర్టుకు ఈడ్చారని ఫైర్ అయ్యారు. సొంత చెల్లి పుట్టుకపై




దుష్ప్రచారం చేయించిన మీరు మహిళలను గౌరవిస్తారని ఆశించడం అత్యాశలేనని లోకేష్ విమర్శించారు. మహిళలపై వైసీపీ నేతలు మాట్లాడుతున్న మాటలకు, పొదిలిలో మహిళలపై చేసిన దాడికి జగన్‌రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని మంత్రి నారా లోకేష్ డిమాండ్ చేశారు.

# మాట నిలబెట్టుకున్న సర్కార్.. రేపే నిధుల విడుదల




**అమరావతి, (రాజధాని వార్తలు):** తల్లులకు కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మరో ముఖ్యమైన పథకం అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తల్లికి వందనం పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా రేపు (గురువారం) తల్లులకు కానుకగా తల్లికి వందనం నిధులు ఇవ్వాలని నిర్ణయించింది. రేపే (జూన్ 12) తల్లికి వందనం నిధులు విడుదల కానున్నాయి. రాష్ట్రంలో మొత్తం 67 లక్షల మందికి తల్లికి వందనం పథకం కింద వారివారి ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేయనుంది. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ తల్లికి వందనం ఇస్తామన్న మేనిఫెస్టో హామీ మేరకు పథకం అమలుకు నిర్ణయం తీసుకుంది సర్కార్. తల్లికి వందనం కింద ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ప్రభుత్వం చెల్లించనుంది. ఈ మేరకు 67,27,164 మంది విద్యార్థులకు ఈ పథకం వర్తించనుంది. తల్లికి వందనం పథకం కింద రేపు తల్లుల ఖాతాల్లో రూ.8,745 కోట్లను కూటమి ప్రభుత్వం జమ చేయనుంది. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తల్లికి వందనం నిధులు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం ఈరోజు అర్ధరాత్రి నుంచే నిధులు విడుదలకానున్నాయి. 1వ తరగతిలో అడ్మిషన్ పొందే పిల్లలు, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేరే విద్యార్థులకూ తల్లికి వందనం పథకం అమలు కానుంది. అడ్మిషన్లు పూర్తి అయ్యి డేటా అందుబాటులోకి రాగానే ఆ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమకానున్నాయి. ఈ మేరకు విధి విధానాలను ఖరారు చేస్తూ ఈరోజు అర్ధరాత్రికి ప్రభుత్వం జీవో విడుదల చేయనుంది. సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్, మెగా డీఎస్సీ, దీపం-2 పథకాలను ప్రభుత్వం అమలు చేసిన విషయం తెలిసిందే. ఇక తల్లికి వందనం నిధుల విడుదల చేయాలన్న నిర్ణయంతో ఇచ్చిన మాటను నిలుపుకుంది కూటమి సర్కార్.

# పోలవరం, బనకచర్లతో రాయలసీమ అభివృద్ధి : మంత్రి నిమ్మల

**కర్నూలు జిల్లా, (రాజధాని వార్తలు):** పోలవరం, బనకచర్ల ప్రాజెక్ట్‌లు పూర్తి అయితే రాయలసీమ పచ్చగా మారుతోందని మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని ఓర్వలేక వైసీపీ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారని ధ్వజమెత్తారు. పోలవరం, బనకచర్లను ఏపీ ప్రభుత్వం రూ.80 వేల కోట్లతో నిర్మించనుందని వెల్లడించారు. రాష్ట్రాన్ని వైసీపీ ఐదేళ్లు పాలించి.. ఖాళీ చిల్లుకుండ ఇస్తే, చంద్రబాబు ఆ చిల్లు పూడ్చి నింపే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు మంత్రి నిమ్మల రామానాయుడు. ఇవాళ (బుధవారం) మంత్రి నిమ్మల రామానాయుడు కర్నూలు జిల్లాలో పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి నిమ్మల పాల్గొన్నారు. కల్లూరు మండలం తడకనపల్లెలో రూ.678.50 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు నిర్మించారు. రూ.141 లక్షలతో కర్నూలు - అనుగొండ రోడ్డు నుంచి దొడ్డిపాడు వరకు నిర్మించిన తారురోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాషా పాల్గొన్నారు. తడకనపల్లి గ్రామం మహిళలు దేశానికే గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాతో మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా డ్వాక్రా సంఘాలు తీసుకువచ్చి, మహిళలకు ఆర్థిక భరోసా కల్పించిన ఘనత ఏపీ సీఎం చంద్రబాబుదేనని మంత్రి నిమ్మల రామానాయుడు ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన తర్వాతే మహిళలకు పూర్తిస్థాయిలో స్వాతంత్రం వచ్చిందని అన్నారు. మహిళల ఆరోగ్య భద్రత కోసం దీపం పథకాన్ని సీఎం చంద్రబాబు తీసుకువచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం మహిళా పక్షపాత ప్రభుత్వమని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చిన మొదటి



నెలలోనే పెంచిన పెన్షన్ అందించామని వెల్లడించారు మంత్రి నిమ్మల రామానాయుడు. రూ.1000లు పెన్షన్ పెంచడానికి జగన్‌కి ఐదేళ్లు పట్టిందని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. కర్నూలు జిల్లాలో 2294 పనుల కోసం రూ.2014 కోట్లు ఖర్చు చేశామని అన్నారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు పలు కీలక పరిశ్రమలు తీసుకు రావడం జరిగిందని చెప్పారు. 5653 హెక్టార్ల డ్రిప్‌ను ఇప్పటికే పూర్తి చేశామన్నారు. రూ.3800 కోట్లు హంద్రీనీవా ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు వేగవంతం చేశామని తెలిపారు మంత్రి నిమ్మల రామానాయుడు. గత ఐదేళ్లలో ఒక్క రూపాయి ఖర్చు పెట్టకుండా, తట్ట మట్టి కూడా తీయలేదని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మోటార్లను సైతం పూర్తి స్థాయిలో వాడుకోలేదని చెప్పారు. 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తుంటే, అందులో కర్నూలు జిల్లాకే 30 శాతం పోస్టులు కేటాయించారని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

# రానున్న ఐదు రోజులు భారీ వర్షాలు




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** పశ్చిమ మధ్య బంగాళాఖాతం, ఉత్తర కోస్తా తీరాన్ని ఆనుకుని ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. అలాగే రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. వీటి ప్రభా వంతో రానున్న ఐదు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. రానున్న 24 గంటల్లో ఒక మోస్తరు వర్షాలతోపాటు ఒకటి రెండు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్.. అలాగే బాపట్ల, కృష్ణ, గుంటూరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది. అయితే కృష్ణాజిల్లాలోని గుడివాడ పట్టణంలో ఇవాళ (బుధవారం) అత్యధికంగా 11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. అలాగే కైకలూరు, మచిలీపట్నం 7, ఏలూరు 6, నూజివీడు, భీమడోలు, రేపల్లెలో 5 సెంటీమీటర్లు, లేపాక్షిలో 4 సెంటీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది.

# తత్కాల్ బుకింగ్ కోసం కొత్త రూల్.. అలా అయితేనే టికెట్లు.. రైల్వే శాఖ కీలక నిర్ణయం..

**ఢిల్లీ:** తత్కాల్ టికెట్లకు సంబంధించి రైల్వే శాఖ మరో కొత్త నిబంధన అమల్లోకి తీసుకురాబోతోంది. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా యాప్‌లో ఆధార్ అథంటికేటెడ్ వ్యక్తులకే తత్కాల్ టికెట్ బుకింగ్ సదుపాయం కల్పించాలని నిర్ణయం తీసుకుంది. జులై 1వ తేదీ నుంచి ఈ నిబంధనను అమలు చేయబోతున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు అన్ని జోన్లకు తాజాగా సర్క్యులర్ జారీ చేసింది. ఆధార్ అథంటికేటెడ్ కాని వ్యక్తులు జులై 1 తర్వాత తత్కాల్ టికెట్లను బుక్ చేసుకోలేరు.

ఇక, జులై 15 నుంచి తత్కాల్ టికెట్ల బుకింగ్‌కు ఆధార్ బేస్డ్ ఓటీపీ కూడా తప్పనిసరి చేయబోతున్నట్టు రైల్వే శాఖ ప్రకటించింది. రైల్వే శాఖకు చెందిన టికెట్ బుకింగ్ కౌంటర్లలో, ఏజెంట్ల దగ్గర తత్కాల్ టికెట్లు బుక్ చేయాలంటే వ్యక్తుల మొబైల్‌కు వచ్చే ఆధార్ ఓటీపీని చెప్పాల్సి ఉంటుంది. అలాగే ఏజెంట్లకు తత్కాల్ టికెట్ల బుకింగ్ చేసే అవకాశాన్ని తొలి అరగంట ఇవ్వబోమని రైల్వే శాఖ తేల్చి చెప్పింది. అంటే ఏసీ కోచ్ టికెట్లను ఉదయం 10:30 తర్వాత, స్లీపర్ క్లాస్ టికెట్లను ఉదయం 11:30 గంటల తర్వాత మాత్రమే ఏజెంట్లు బుక్ చేయడానికి వీలవుతుంది. ఈ ఆదేశాలకు అనుగుణంగా రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఐఆర్‌సీటీసీ తమ సిస్టమ్స్‌లో మార్పులు చేసుకోవాలని రైల్వే శాఖ సూచించింది.

# వేములవాడ పట్టణ సమగ్రాభివృద్ధి ధ్యేయం

## - ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ, (రాజధాని వార్తలు):** వేములవాడ పట్టణ సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణం లోని 11, 12 వార్డుల్లో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పను లకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సుమారు మూడు కోట్ల రూపాయలకు పైగా నిధులతో వేములవాడ పురపాలక సంఘం పరిధిలోని 28 వార్డుల్లో సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నా మని తెలిపారు. ఒకవైపు పట్టణ అభివృద్ధి మరోవైపు రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామ న్నారు. గత పాలకులలాగా ఇచ్చిన మాట తప్పకుండా ఎన్నికల హామీ నెరవేర్చే విధంగా కార్యాచరణతో పని చేస్తున్నామన్నారు. మూల వాగుపై రెండో బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేసి పది సంవత్సరాలు గడిచిన గత పాలకులు పట్టించుకోలేదని, బ్రిడ్జి నిర్వాసితులకు పరిహారం కూడా ఇవ్వలేదని అన్నారు. తాము అధికారం లోకి వచ్చాక బ్రిడ్జి నిర్వాసితులకు సైతం పరిహారం అందించామని, వర్షాకాలంలో బ్రిడ్జి నిర్మాణం మొదలుపెడితే సాంకేతికంగా ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వేములవాడ పట్టణం తోట నియోజకవర్గంలోని అన్ని మండలాలు గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి**

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కార్యకర్తలు చిత్తశుద్ధితో కృషిచేయాలని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వేములవాడలో నిర్వహించిన నియోజకవర్గ సోషల్ మీడియా కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా గెలవడంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వారియర్స్ పాత్ర మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జ మల్లేష్, జిల్లా కోకన్వీనర్ కనికరపు రాకేష్, వేములవాడ పట్టణ కన్వీనర్ ఎర్ర శ్రావణ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు న్యాత నవీన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

**పేదలకు వరం.. సీఎంఆర్ఎఫ్ పథకం**

ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేద ప్రజలకు గొప్ప వరమని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేములవాడ అర్బన్, రూరల్ మండలాల పరిధిలో అర్హులైన 72 మంది లబ్ధిదారులకు 24లక్షల 31వేల విలువగల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం కీలకమైన మెడికల్ హబ్‌గా మారిందన్నారు. వైద్యారోగ్య రంగంలో తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న ప్రగతి, ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా మారిందని రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి ప్రజా ఆరోగ్య భద్రతపై ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని చాటుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ టెర్రరిజానికి తండ్రి పాకిస్థాన్... నిప్పులు చెరిగిన రాజ్‌నాథ్

**డెహ్రాడూన్:** భారతదేశ చరిత్రలో ఉగ్రవాదంపై జరిపిన అతిపెద్ద దాడి ఆపరేషన్ సిందూర్ అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా జరిపిన ఆపరేషన్ సిందూర్ భారతదేశ భద్రతా వ్యూహాన్ని బలంగా చాటిచెప్పిందని తెలిపారు. డెహ్రాడూన్‌లో జరిగిన నేషనల్ సెక్యూరిటీ డైలాగ్‌లో రాజ్‌నాథ్ ఉత్తేజభరితమైన ప్రసంగం చేశారు. భారతదేశ రక్షణ, భద్రతా వ్యవస్థకు సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం గత 11 ఏళ్లుగా విస్తృతమైన సంస్కరణలు చేపట్టిందని ప్రశంసించారు. రక్షణ ఉత్పత్తులు, ఎగుమతులు లక్ష్యంగా మరింత పటిష్ట, స్వయంసమృద్ధ భారత్‌కు కృషి జరుగుతోందని, ఇదే సమయంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దృఢ వైఖరి తీసుకున్నామని అన్నారు. కేంద్రం 370వ అధికరణను రద్దు చేసిన తర్వాత జమ్మూకశ్మీర్‌లో శాంతి పవనాలు వీస్తూ, ప్రగతిపథంలోకి దూసుకు వెళ్తున్నామని అన్నారు. దీనిని పాకిస్థాన్ ఉగ్రవాద కార్యకలాపాల ద్వారా పట్టాలు తప్పించే ప్రయత్నాలు చేస్తోందని దుయ్యపట్టారు. పాకిస్థాన్ ఎన్ని ప్రయత్నాలు చేసినా కశ్మీర్ ప్రగతిని ఎవ్వరూ అడ్డుకోలేరన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ప్రజాస్వామ్యానికి తల్లిగా భారత్ గుర్తింపు తెచ్చుకుందని, పాకిస్థాన్ మాత్రం అంతర్జాతీయ ఉగ్రవాదానికి తండ్రిగా మారిందని అన్నారు. పాకిస్థాన్‌కు విదేశీ నిధులు ఆపేయాలని అంతర్జాతీయ కమ్యూనిటీకి విజ్ఞప్తి చేశారు. పాకిస్థాన్‌కు నిధులు ఇస్తే ఉగ్రవాదానికి నిధులిచ్చినట్టేనని అన్నారు. స్వదేశీ రక్షణ ఉత్పత్తులను పెంచేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వివరిస్తూ, 2013-2014లో రూ.2.53 లక్షల కోట్లు ఉన్న రక్షణ బడ్జెట్‌ను 2024-2025లో 6.22 లక్షల కోట్లకు పెంచామని చెప్పారు. రక్షణ ఉత్పత్తులు రూ.1.30 లక్షల కోట్ల నుంచి రూ.686 కోట్లకు పెరిగాయని చెప్పారు. 2025 ఆర్థిక సంవత్సరంలో ఈ ఉత్పత్తుల లక్ష్యం రూ.1.75 లక్షలుగా, ఎగుమతులు రూ.30,000 కోట్లుగా ఉందని చెప్పారు.




# దేశంలో పడిపోతున్న జననాల రేటు

**- భర్తీ రేటు కన్నా తక్కువగా 1.9 నమోదు - ఆర్థిక పరిస్థితుల వల్లే పరిమిత కుటుంబం**
**- స్థిరంగానే కొనసాగుతున్న యువత జనాభా - పని చేయదగిన వారు 68 శాతం మంది**
**- వృద్ధులు 7 శాతం.. దేశ జనాభా 146 కోట్లు.. వచ్చే 40 ఏళ్లలో 170 కోట్లకు**
**- ఆ తర్వాత క్రమేణా తగ్గుదల.. ఐరాస ప్రపంచ జనాభా నివేదిక-2025లో వెల్లడి**



**న్యూఢిల్లీ :** ఒకపక్క ఆర్థిక ఇబ్బందులు.. మరోపక్క ఉరుకులు పరుగుల జీవితం.. దీంతో దేశంలో జననాల రేటు వేగంగా పడిపోతోంది. యాభై ఏళ్ల క్రితం సగటున ఐదారుగురు పిల్లలు ఓ కుటుంబంలో ఉండగా, ఇప్పుడు ఒకరు లేదా ఇద్దరితో సరిపెట్టుకుంటున్నారు. ఈ పరిస్థితి భవిష్యత్‌లో జనాభా పెరుగుదలకు సవాల్‌గా మారనుంది. ప్రస్తుతం ప్రపంచ జనాభాలో మనదేశం అగ్రస్థానంలో కొనసాగుతోంది. భారతదేశ జనాభా ఈ ఏడాది 146 కోట్లకు చేరింది. దేశ జనాభా పెరుగుదల, ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని ఐక్యరాజ్యసమితి తన జనాభా నివేదికలో వివరించింది. యూఎన్ఎఫ్‌పీఏకు చెందిన స్టేట్ ఆఫ్ వరల్డ్ పాప్యులేషన్ (ఎస్ఓడబ్ల్యూపీ) 2025 నివేదికను మంగళవారం విడుదల చేసింది. భారతదేశ జనాభా భర్తీ రేటు కంటే జననాల రేటు తక్కువ ఉందని దానిలో వెల్లడించింది. జనాభా పెరుగుదల, తగ్గుదల సంక్షోభం కాదని, జననాల రేటు తగ్గడమే నిజమైన సంక్షోభమని పేర్కొంది. లక్షలాది మంది ప్రజలు పునరుత్పత్తి లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారని చెప్పింది. జననాల రేటు 1.9కి పడిపోయిందని, భర్తీ స్థాయి 2.1 కంటే తక్కువగా ఉందని, అంటే జనాభా సంఖ్యను కొనసాగించడానికి కావాల్సిన జననాల రేటులో దేశం లేదని స్పష్టం చేసింది. జననాల రేటు మందగించినా.. యువత జనాభా మాత్రం దేశంలో గణనీయంగానే ఉందని తెలిపింది. 0-14 ఏళ్ల వారు 24 శాతం, 10-19 ఏళ్ల వారు 17 శాతం, 10-24 ఏళ్ల వారు 26 శాతం ఉన్నారని వెల్లడించింది. పని చేసే వయసు (15-64)లో ఉన్న వారు 68 శాతం ఉన్నారని వెల్లడించింది. ఇక 65 ఏళ్లు దాటిన వృద్ధులు మొత్తం జనాభాలో 7 శాతంగా ఉన్నారి, ఆయుర్దాయం అంచనా పెరుగుతున్న నేపథ్యంలో వృద్ధుల సంఖ్య వచ్చే కాలంలో మరింత పెరుగుతుందని అంచనా వేసింది.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



**సిరిసిల్ల రూరల్, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలందరికి నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని, పిల్లలందరిని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేష్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సిరిసిల్లలో మంగళవారం తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్, బోయన్న గారి నారాయణల ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీని పట్టణంలోని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య, ఏఐ ఆధారిత విద్య, డిజిటల్ విద్యలను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అందిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలందరిని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మెంబర్‌షిప్ కన్వీనర్ సుంకిశీల ప్రభాకర్‌రావు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మోతీలాల్, టీఆర్‌టీఎఫ్ నాయకులు పోతుగంటి రమేష్, మహేశుని లక్ష్మీనారాయణ, గోలీ రాధాకిషన్, ముత్తయ్యగారి నాగరాజు, జిల్లెల్ల శ్రీనివాస్‌గౌడ్, ఇప్పకాయల ప్రకాష్, రాజశేఖర్, దేవేందర్, పప్పుల శ్రీనివాస్, సామల రాములు, కుమారస్వామి, పులి ప్రవీన్‌కుమార్, కోల వినయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు బాల ఎల్లయ్య, కొమురయ్య, సుల్తాన్ రాజు, బూట్ల శ్రీనివాస్, శ్రీనివాస రావు, మామిడాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సజ్జల వ్యాఖ్యలపై రఘురామ ఫైర్

**- సంకరజాతి అంటూ దూషించిన ఆయనపై చర్యలు ఉంటాయి**
**- ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలంటూ డీజీపీకి ఫిర్యాదు చేసిన ఆర్ఆర్ఆర్**

**కాళ్ల, (రాజధాని వార్తలు):** అమరావతి ప్రజలను ఉద్దేశించి వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఖచ్చితంగా చర్యలు ఉంటాయని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు స్పష్టం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పెద అమిరంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'అమరావతిలో మహిళలను వేశ్యలుగా వర్ణిస్తూ జగన్ మీడియాలో మాట్లాడిన జర్నలిస్టు కృష్ణంరాజు, యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్థానిక మహిళలు వారి ఫొటోలను చెప్పులతో కొట్టారు. దానిపై వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి దెయ్యాలు వేదాలు వల్లించినట్లు మాట్లాడటం హాస్యాస్పదం. ఆగ్రహం వ్యక్తం చేసిన మహిళలని రాక్షసులు, పిశాచులు, సంకర జాతి అంటూ మాట్లాడటం దారుణం. అమరావతి ప్రాంతంలో కేవలం ఒక కులం వారే జీవించడం లేదు. అక్కడ ఎస్సీ, బీసీ, ఎస్టీ, ఓసీ... తదితర అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారు జీవిస్తున్నారు. అమరావతిలో నివాసం ఉంటున్న వారిని సంకరజాతి అనడం క్షమించరాని పదం. సమాజాన్ని కించపరుస్తూ మాట్లాడిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డీజీపీకి ఫిర్యాదు చేశా. ఆ మీడియా సంస్థను నడుపుతున్న వ్యక్తి కూడా మహిళే. ఆమె కూడా ఇటువంటి వ్యాఖ్యలను ఖండించకపోగా అరెస్టును నిరసించడం సమంజసం కాదు' అని రఘురామ అన్నారు.



# జగన్ దగ్గర సొంత చెల్లికే మర్యాద లేదు

**- రాష్ట్రంలో మహిళలను ఇంకేం గౌరవిస్తారు?**
**- సజ్జల మూర్ఖుడిలా మాట్లాడుతున్నారు : షర్మిల**



**రాయచోటి, పుట్టపర్తి టౌన్, (రాజధాని వార్తలు):** 'వైఎస్ జగన్మోహన్ రెడ్డి దగ్గర సొంత చెల్లికే గౌరవం, మర్యాద లేదు. రాష్ట్రంలోని మహిళలకు ఇంకేం గౌరవం ఉంటుంది?' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. మంగళవారం అన్నమయ్య జిల్లా రాయచోటిలో, శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యకర్తల సమావేశాల్లో ఆమె పాల్గొన్నారు. ఆ రెండు చోట్ల ఆమె మీడియాతో మాట్లాడారు. 'రక్త సంబంధమే నాపై విష ప్రచారం చేసింది. నేను వైఎస్సార్‌కు పుట్టలేదని, విజయమ్మకు తాను అక్రమ సంతానమని అన్నారు. అక్రమ సంబంధాలను అంటగట్టే సైతాన్ సైన్యం వైసీపీ. సజ్జల కొడుకు సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని నాపై దాడి చేశాడు. రక్త సంబంధం, అక్కచెల్లెళ్ల బంధం గురించి వైసీపీ మాట్లాడడం విడ్డురంగా ఉంది. తల్లిని, చెల్లిని దూరం చేసుకున్న జగన్ సమాజానికి ఏం చెబుతారు? రాజధాని అమరావతి మహిళలపై సజ్జల వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. ఆయన మూర్ఖుడిలా మాట్లాడుతున్నారు. మహిళలను పిశాచులతో పోల్చి రాక్షసులని, సంకర జాతి అని అవమానిస్తారా? చేసిన తప్పుకి క్షమాపణ చెప్పడానికి నామోషీ ఎందుకు? కాంగ్రెస్ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్న వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం' అని షర్మిల హెచ్చరించారు.

# అఖిలపక్ష ఎంపీల ప్రతినిధి బృందంతో మోదీ

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ ప్రమేయమున్న ఉగ్రవాదంపై భారత్ వైఖరిని వివరించేందుకు ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రపంచ రాజధానుల్లో పర్యటించి వచ్చిన అఖిలపక్ష ప్రతినిధుల బృందాల సభ్యులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారంనాడు సమావేశమయ్యారు. తమ పర్యటనల వివరాలను ఎంపీలతా ప్రధానితో పంచుకున్నారు. 50 మందికి పైగా ప్రతినిధులతో ఏడు బృందాలు ప్రపంచదేశాల్లో పాక్ వైఖరిని ఎండగడుతూ, ఉగ్రవాదంపై పోరులో భారత వాణిని బలంగా వినిపించడంపై కేంద్ర ఇప్పటికే అభినందనలు తెలియజేసింది. 33 దేశాల రాజధానులు, యూరోపియన్ యూనియన్‌లో పర్యటించిన ప్రతినిధుల బృందాల్లో మాజీ పార్లమెంటేరియన్లు, మాజీ దౌత్యవేత్తలు కూడా ఉన్నారు. విదేశీ పర్యటనలు ముగించుకుని వచ్చిన ప్రతినిధుల బృందం ఇప్పటికే కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌ను కలుసుకుంది. పాకిస్థాన్ స్పాన్సర్డ్ టెర్రరిజంపై భారత వైఖరిని బలంగా వినిపించిన సభ్యుల కృషి జైశంకర్ అభినందించారు. నాలుగు ప్రతినిధుల బృందాలకు ఎన్డీయే ఎంపీలు సారథ్యం వహించగా, వీరిలో బీజేపీకి చెందిన 2, జేడీయూ, శివసేనకు చెందిన చెరో ప్రతినిధి బృందం ఉంది. తక్కిన మూడు ప్రతినిధి బృందాలకు విపక్ష ఎంపీలు సారథ్యం వహిచారు. కాంగ్రెస్, డీఎంకే, ఎన్సీ (ఎస్పీ)లు ఒక్కో ప్రతినిధి బృందానికి నేతృత్వం వహించాయి. బీజేపీ నేతలు రవిశంకర్ ప్రసాద్, బైజయంత్ పాండ, కాంగ్రెస్ నేత శశిథరూర్, జేడీయూ నేత సంజయ్ ఝా, శివసేన నేత శ్రీకాంత్ షిండే, డీఎంకే నేత కనిమొళి, ఎన్సీపీ (ఎస్పీ) నేత సుప్రియా సులే సారథ్యంలో ఈ ప్రతినిధుల బృందాలు విదేశాల్లో పర్యటించాయి. టెర్రరిజంపై పోరులో అంతా ఏకతాటిపై ఉన్నామనే జాతీయ ఐక్యతా సందేశాన్ని ప్రపంచానికి చాటేందుకు కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష ప్రతినిధుల బృందాలను ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్, ఏఐఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ వంటి నేతలు అధికార కూటమి సభ్యులతో కలిసి ప్రపంచ దేశాల్లో తమ వాణిని బలంగా వినిపించారు. మాజీ పార్లమెంటేరియన్లలో కేంద్ర మాజీ మంత్రులు గులాం నబీ ఆజాద్, సల్మాన్ ఖుర్షీద్ వంటి వారు సైతం ఉగ్రవాదంపై పోరులో భారతదేశ ఐక్యతా సందేశాన్ని చాటారు.




# ఎన్టీఆర్- త్రివిక్రమ్ ప్రాజెక్ట్‌ని కన్ఫర్మ్ చేశాడుగా!



'పుష్ప 2' తరువాత ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మాటల మాంత్రికుడు త్రివిక్రమ్‌తో ఓ భారీ మైథలాజికల్ డ్రామాని చేయబోతున్నట్టుగా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే 'పుష్ప 2' పాన్ ఇండియా వైడ్‌గా బ్లాక్ బస్టర్ కావడ్తో బన్నీ ప్లాన్ మారింది. త్రివిక్రమ్ ప్రాజెక్ట్ స్థానంలో తమిళ దర్శకుడు అట్లీతో పాన్ వరల్డ్ సినిమాకు శ్రీకారం చుట్టాడు. ఈ మార్పే త్రివిక్రమ్ ప్రాజెక్ట్‌ని చేతులు మారేలా చేసి ఫైనల్‌గా అది ఎన్టీఆర్ వద్దకు చేరేలా చేసింది. మైథలాజికల్ మూవీ కావడం, దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్‌కు సమయం పట్టేలా ఉండటంతో అట్లీ ప్రాజెక్ట్‌ని బన్నీ ఎంచుకున్నాడని ప్రచారం జరిగింది. తాజా పరిణామాలు చూస్తే అదే నిజమని తెలుస్తోంది. అంతే కాకుండా ఈ ప్రాజెక్ట్ చేతుల మారి ఎన్టీఆర్ వద్దకు వెళ్లిందనే ప్రచారానికి బలాన్ని చేకూరుస్తూ బన్నీతో చేయాలనుకున్న ప్రాజెక్ట్‌ని ఎన్టీఆర్‌తో చేస్తున్నామని యువ నిర్మాత, సితారా ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత సూర్యదేవర నాగవంశీ సోషల్ మీడియా వేదికగా క్లారిటీ ఇవ్వడం ఆసక్తికరంగా మారింది. నాకు అత్యంత అభిమానమైన అన్న వన్ ఆఫ్ ద మోస్ట్ పవర్ ఫుల్ గాడ్‌గా కనిపించబోతున్నాడని చెబుతూ 'కార్తికేయో మహాసేన శ్వరజన్మా షడాననః, పార్వతీ నందనః స్కంద స్సేనానీ రగ్నిభూర్గుహః' అనే శ్లోకాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ ఎన్టీఆర్- త్రివిక్రమ్‌ల మైథలాజికల్ ప్రాజెక్ట్‌ని ఆల్ మోస్ట్ కన్ఫర్మ్ చేసేశాడు. సూర్యదేవర నాగవంశీ పోస్ట్ చేసిన శ్లోకాన్ని బట్టే ఈ మైథలాజికల్ డ్రామా కార్తికేయ స్వామి నేపథ్యంలో సాగుతుందని స్పష్టమవుతోంది. అంతే కాకుండా సోషల్ మీడియాలో గాడ్ ఆఫ్ వార్ కమింగ్ అంటూ మరో శ్లోకాన్ని పోస్ట్ చేయడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. మయూరాధిరూఢం మహావాక్యగూఢం..మనోహారిదేహం మహచ్చిత్తగేహమ్ఎ మహీదేవదేవం మహావేదభావం మహాదేవ బాలం భజే లోకపాలమ్ "3" అంటూ మరో హింట్ ఇచ్చారు. ఇంత వరకు పురాణాల్లోని శివుడి మీద, వినాయకుడిపై ఎన్నో సినిమాలొచ్చాయి.

కానీ కార్తికేయుడిపై మాత్రం రాలేదు. కుమారస్వామిని సుబ్రహ్మణ్య స్వామి, స్కంద, మురుగన్ అని కూడా పిలుస్తారు. అలాంటి కుమారస్వామి కథలోని ప్రధాన ఘట్టాలని తీసుకుని ఆయన స్కంద సైన్యం నేపథ్యంలో త్రివిక్రమ్ ఈ మైథలాజికల్ మూవీని తెరపైకి తీసుకు రావాలనుకుంటున్నారట. సూర్యదేవర నగావంశీ పోస్ట్ చేసిన శ్లోకంలో 'స్కంద స్సేనాని'ని ప్రత్యేకంగా కోట్ చేశారు. దాన్ని బట్టి చూస్తే ఈ భారీ మైథలాజికల్ డ్రామాకు ఇదే పేరుని ఫైనల్ చేసే అవకాశం ఉందనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

# సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీపై దివి ఏమందంటే..!



సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీ వివాదాస్పదంగా మారింది. బర్త్‌డే పార్టీలో గంజాయి, విదేశీ మద్యం లభించినట్టుగా పోలీసులు తెలిపారు. దీంతో ఒక్కసారిగా మగ్లీ వార్తల్లో నిలిచింది. మంగ్లీ పుట్టిన రోజు సందర్భంగా రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని ఈర్లపల్లి శివారులో గల ఓ రిసార్టులో స్నేహితులకు మంగళవారం రాత్రి మంగ్లీ పార్టీ ఇచ్చింది. ఈ పార్టీలో 50 మంది వరకు కుటుంబ సభ్యులు, స్నేహితులు హాజరయ్యారు. వీరిలో సినీ పరిశ్రమకు చెందిన వారు కూడా ఉన్నట్లుగా సమాచారం. మంగ్లీ బర్త్‌డే పార్టీ అర్ధరాత్రి వరకు జరగడంతో ఈ పార్టీలో విదేశీ మధ్యం, గంజాయి వినియోగించారని స్థానిక పోలీసులకు సమాచారం అందడంతో అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఎస్ఓటీ పోలీసులు రిసార్ట్‌పై దాడులు నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే సింగర్ మంగ్లీ, రిసార్ట్ నిర్వహకుడు, పార్టీ నిర్వాహకుడు, టెస్టుల్లో పాజిటివ్‌గా తెలిన ఓ వ్యక్తిపై కేసులు నమోదు చేశారు. దీంతో మంగ్లీ బర్త్‌డే పార్టీ ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారి సంచలనం సృష్టిస్తోంది. మంగ్లీ బర్త్‌డే పార్టీలో బిగ్ బాస్ ఫేమ్ దివి కూడా పాల్గొనడంతో తనపై కూడా వరుస కథనాలు మొదలయ్యాయి.

దీనిపై తాజాగా దివి విరణ ఇస్తూ మీడియాకు ఓ ఆడియోని విడుదల చేసింది. మీడియా మిత్రులందరికీ చిన్న రిక్వెస్ట్. ఫ్రెండ్ బర్త్‌డే పార్టీ అని వెళితే..అక్కడ జరిగిన తప్పుల్ని మాపై తోయడం తప్పుకదాండి. మీరు కూడా చూసి దాన్ని బట్టి నిజంగా ఏమైనా ఆధారాలు ఉంటే నేను కూడా తప్పులు చేశానని అనుకుంటే నా ఫోటో వేయండి. కానీ ఎలాంటి ఆధారాలు లేకుండా మీడియా మిత్రులు నా ఫోటో యూజ్‌చేసి నెగెటివ్‌గా ప్రచారం చేస్తే నాకు, నా కెరీయర్‌కు ఎంత ఇబ్బందిగా ఉంటుందో అర్థం చేసుకోండి. ఎంతో కష్టపడి నేను ఈ స్థాయికి వచ్చాను. మీరు కూడా సాధారణంగా ఫ్రెండ్ బర్త్‌డే అంటే వెళతారు. అలాగే నాకు మంగ్లీ మంచి ఫ్రెండ్ కాబట్టే తన బర్త్‌డే పార్టీకి వెళ్లాను. అయితే అక్కడ జరిగిన పరిస్థితులకు నేను కూడా బాధ్యురాలిని అని నా ఫోటోని పెట్టి న్యూస్ వేయడం తప్పండి అంటూ ఆడియోని విడుదల చేసింది.

# 2026 లో అమీర్-లోకేష్ పిక్సైపోయారు



బాలీవుడ్ నటుడు అమీర్‌ఖాన్ ప్రతిభావంతులైన దర్శకుల్ని వెతికి పట్టుకోవడంలో గొప్ప మేధావి. తన అనుభవాన్ని రంగరించి ఇండస్ట్రీలో ఎవరు పనివంతులో గమనించి వాళ్లతో పచేస్తుంటారు. అమీర్ సొంత నిర్మాణ సంస్థలో బయట హీరోలతో నిర్మించడం గానీ...తానే రంగంలోకి దిగడంగానీ చేస్తుంటారు. ప్రస్తుతం అమీర్ ఖాన్ ...సూపర్ స్టార్ రజనీ కాంత్ కథానాయకుడిగా లోకేష్ కనగరాజ్ తెరకెక్కిస్తోన్న కూలీలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా లోకేష్‌తో అమీర్ సినిమా చేయబోతున్నారు అన్న ప్రచారం కూడా మొదలైంది. కొత్త దర్శకులతో అమీర్ లాంటి పేరున్న నటుడు రంగంలోకి దిగితే ఇలాంటి ప్రచారం సహజమే. కానీ ఈ ప్రచారం నిజమవుతుంది. లోకేష్‌తో సినిమా చేయడానికి అమీర్ ఖాన్ సిద్దంగా ఉన్నారని కాలక్రమంలో అర్దమైంది. అయినా లోకేష్ బిజీ దర్శకుడు. చేతిలో పూర్తి చేయాల్సిన ప్రాజెక్ట్‌లు చాలా ఉన్నాయి. అవన్నీ పూర్తయిన తర్వాతే అమీర్ సినిమా గురించి కూల్‌గా ఆలోచన చేసే అవకాశం ఉంటుందని అంతా భావిస్తున్నారు. కానీ అమీర్ ఖాన్ అంత సమయం తీసుకోవడం లేదు. ఉన్న పళంగా ఇద్దరు కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నట్లు కనిపిస్తుంది. ఇదే సందేహాన్ని ఓ బాలీవుడ్ మీడియా జర్నలిస్ట్ అమీర్ ఖాన్ ముందుకు తీసుకెళ్లగా... అమీర్ సంతోషంగా అంగీకరించారు. ఆ ప్రచారాన్ని అమీర్ ఖాన్ ధృవీకరించారు. ఇద్దరు కలిసి సినిమా చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతం తాను వేర్వేరు కమిట్ మెంట్లతో ఉన్నానని అవన్నీ ఇదే ఏడాది ముగించుకుని వచ్చే ఏడాది ఆగస్టు లేదా సెప్టెంబర్‌కు సిద్దంగా ఉంటానన్నారు.

దీంతో ప్రాజెక్ట్ కన్ఫమ్ అయింది. ఈలోగా లోకేష్ కనగరాజ్ పూర్తి చేయాల్సిన ప్రాజెక్ట్ లున్నాయి. కార్తీ తో 'ఖైదీ 2' ముగించాలి. ఆ తర్వాత సూర్యతో 'రోలెక్స్' సినిమా చేసే అవకాశం ఉంటుంది. ఒకవేళ ఈ ప్రాజెక్ట్‌కి టైమ్ ఎక్కువ పడుతుందంటే అమీర్ సినిమా కోసం పని చేయడం మొదలు పెడతారు.

# రష్మిక 'చెన్నై' పోస్ట్.. కన్నడిగులు ఫీల్ అయ్యారా?



స్టార్ హీరోయిన్ రష్మిక.. ఇప్పుడు కెరీర్‌లో ఓ రేంజ్‌లో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. నార్త్ టు సౌత్ వరుస సినిమాలతో అలరిస్తున్నారు. నాన్ స్టాప్‌గా షూటింగ్స్‌తో బిజీగా గడుపుతున్నారు. ఇప్పుడు కుబేర మూవీతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. జూన్ 20వ తేదీన వరల్డ్ వైడ్‌గా గ్రాండ్‌గా రిలీజ్ కానుందీ చిత్రం. కుబేరలో కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, టాలీవుడ్ కింగ్ నాగార్జున లీడ్ రోల్స్ పోషించగా.. రష్మిక ఫిమేల్ లీడ్‌లో కనిపించనున్నారు. అయితే పాన్ ఇండియా మూవీ కనుక.. మేకర్స్ సినిమాను అంతే విధంగా ప్రమోట్ చేస్తున్నారు. అదే సమయంలో రష్మిక.. ప్రమోషన్స్‌లో చురుగ్గా పాల్గొంటున్నారు. తన వంతు న్యాయంగా ప్రమోట్ చేస్తున్నారు. రీసెంట్‌గా చెన్నైలో జరిగిన ఈవెంట్‌లో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారని చెప్పాలి. ప్యాస్టల్ కలర్ సూపర్ డ్రెస్‌లో తళుకుమన్న భామ.. తన గ్లామర్‌తో మెప్పించారు. ఇప్పుడు ఆ పిక్స్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన అమ్మడు.. లాంగ్ నోట్‌ను రాసుకొచ్చారు. చెన్నైతో తనకున్న అనుబంధాన్ని షేర్ చేసుకుంటూ, టీమ్ కోసం మాట్లాడారు. "కుబేరా ప్రమోషన్లను చెన్నైలో ప్రారంభించాం. మీలో చాలా మందికి తెలిసినట్లుగా చెన్నైలోనే నా బాల్యం గడిచింది. దీంతో నా హృదయంలో చెన్నై ప్రియమైన స్థానాన్ని కలిగి ఉంది. ఎంత అద్భుతమైన సాయంత్రం అది!" అంటూ రాసుకొచ్చారు రష్మిక. కుబేర టీమ్ క్రియేట్ చేసిన మ్యాజిక్ కోసం వెయిట్ చేయండని కోరారు. అయితే చెన్నైకి తన హృదయంలో ప్రత్యేక స్థానమని పెట్టిన రష్మిక పోస్ట్.. కొందరు కన్నడిగులకు ఆగ్రహం తెప్పించిదట. ఆమెది చెన్నై అన్నట్లే పోస్ట్ పెట్టారని కొందరు అభిప్రాయపడుతున్నారు. పుట్టి పెరిగి స్కూల్ చదువుకున్నదంతా కర్ణాటకలో అయితే.. చెన్నైలో బాల్యం గడవడం ఏంటని ఇప్పుడు కన్నడ నెటిజన్లు అంటున్నారు. రష్మిక ఏ ఉద్దేశ్యంతో పెట్టారో గానీ.. ఇప్పుడు ఆ పోస్ట్ మాత్రం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కొద్ది రోజుల ముందు కన్నడ సూపర్ హిట్ కాంతార మూవీ చూడలేదని అనడంతో అనేక మంది ట్రోల్స్ చేశారు. ఆ తర్వాత హైదరాబాద్ తనకు ఇల్లు లాంటిదని వ్యాఖ్యానించడంతో విమర్శించారు. ఇప్పుడు చెన్నైలో బాల్యం గడిచిందని అనడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరి దీనిపై రష్మిక స్పందిస్తారో వేచి చూడాలి.

# స్థానిక గాంధీనగరం ప్రభుత్వ ఎస్.సి.హాస్టల్‌లో ప్రముఖ తెలుగు సినీ గాయకులు

## - ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి వేడుకలు, హాస్టల్ విద్యార్థులకు తెలుగు సినీ పాటల పోటీలు - విజేతలకు బహుమతీ ప్రదానం



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** సిద్దార్థ సోషల్ సర్వీస్ & కల్చరల్ అసోసియేషన్, అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యములో స్థానిక గాంధీనగరం ప్రభుత్వ ఎస్.సి.హాస్టల్‌లో ప్రముఖ తెలుగు సినీ నేపథ్య గాయకుడు, పద్మవిభూషణ్ ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి వేడుకలను ఘనముగా నిర్వహించారు. ముందుగా ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి సంస్థ అధ్యక్షుడు బల్లా నాగభూషణము పులమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం హాస్టల్‌లో గల విద్యార్థులకు తెలుగు సినీ పాటల పోటీలు నిర్వహించగా, పోటీలలో 30 మంది పాల్గొనగా వారిలో అయిదుగురు విజేతలను ఎంపిక చేసి వారికి హాస్టల్ వార్డెన్ భాగమతి రామయ్య విద్యార్థులకు మెడల్స్‌ను, సంస్థ అధ్యక్షులు బల్లా నాగభూషణము ప్రశంసా పత్రములను, బహుమతులుగా అందజేశారు. హాస్టల్ వార్డెన్ భాగమతి రామయ్యకి బల్లా నాగభూషణము గౌతమ బుద్ధుని చిత్రపటాన్ని బహుకరించారు. మరియు హాస్టల్ విద్యార్థులు అందరికీ పెన్నులు, బిస్కట్ ప్యాకెట్లును బల్లా నాగభూషణము అందజేశారు. ఈ సందర్భంగా బల్లా నాగభూషణం మాట్లాడుతూ ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం తెలుగు సినీ గాయకునిగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా, నటునిగా, చిత్ర నిర్మాతగా, అనితర సాధ్యమైన రీతిలో ఎంతో ప్రఖ్యాతిగాంచిన గొప్ప మహనీయుడని, అయిదు భాషలలో సుమారు 60 వేల పాటలు పాడి ఎన్నో అవార్డులతో బాటు ప్రభుత్వం వారిచే పద్మవిభూషణ్ అవార్డును కూడా అందుకున్న గొప్ప గాయకులని, తెలుగు సినీ రంగానికి, తెలుగు భాషకు ఎనలేని సేవలను అందించి తెలుగు వారి కీర్తిని ప్రపంచ వ్యాప్తం గావించిన మహనీయవ్యక్తియని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దార్థ అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేషగుప్తా ఉపాధ్యక్షులు, పట్నాల కృష్ణ మోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, సభ్యులు కొత్తూర్తి రామారావు, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

**తెలుగు సినీ పాటల పోటీల విజేతలు..**

1. కె.సాయికిరణ్, (ప్రథమ బహుమతి), 2. ఎల్.గణేష్, ( ద్వితీయ బహుమతి), 3. బి.మోహన్, (తృతీయ బహుమతి), 4. డి.శ్రీహరి (నాల్గవ బహుమతి), 5. ఎస్.రవికుమార్, (అయిదవ బహుమతి)

# పాయకరావుపేటలో టీడీపి కార్యాలయాన్ని ప్రారంభించిన హోం మంత్రి అనిత





**పాయకరావుపేట, (రాజధాని వార్తలు):** పాయకరావుపేట తెలుగు దేశం పార్టీ కార్యాలయాన్ని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె సమక్షంలో వార్డు మెంబర్ పెంకె గోవిందుతో పాటు సుమారు 150 మంది కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. హోం మంత్రి అనిత మాట్లాడుతూ, పాయకరావుపేటలో పార్టీ కార్యాలయం ప్రారంభం ఒక శుభపరిణామన్నారు. నాయకులు ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండాలన్నారు. 2024 ఎన్నికల్లో 44 వేల ఓట్ల మెజార్టీతో ఆశీర్వదించారని, పాయకరావుపేట ప్రజలకు సేవ చేయడం నా పూర్వజన్మ సుకృతం అని పేర్కొన్నారు. నియోజక వర్గంలో గత సంవత్సరం కాలంలో 400 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు జరిగాయన్నారు. బల్క్ డ్రగ్ పార్క్, స్టీల్ ప్లాంట్ వంటి పరిశ్రమలు కూడా త్వరలో ఈ ప్రాంతంలో ఏర్పాటు కాబోతున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులతో పాయకరావుపేట మరో విశాఖపట్నంలా అభివృద్ధి చెందబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నాం అని హోం మంత్రి అనిత అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చించలపు ప్రదీప్, పౌరసరఫరాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ బోడపాటి శివదత్, పట్టణ అధ్యక్షులు యాళ్ల వరహాలు బాబు, టిడిపి నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు తోట నగేష్, మండల ప్రధాన కార్యదర్శి బొంది కాశీ విశ్వనాథ్, చిక్కాల శ్రీను, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# హుకుంపేట ప్రధాన కేంద్రంలో రోడ్డుకి ఒకవైపు 50 మరో వైపు 50 అడుగులు విస్తీర్ణం చేయాలి

## - కోర్టు ఆదేశాలు పాటించకపోతే గిరిజన సంఘం ఉద్యమం చేయడం ఖాయం

**హుకుంపేట (అల్లూరి జిల్లా), (రాజధాని వార్తలు):** అల్లూరి జిల్లా గిరిజన సంఘం ఉపాధ్యక్షులు తాపుల కృష్ణారావు నేడు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు ఏజెన్సీ ప్రాంతం జిల్లా కావడంతో అల్లూరి జిల్లా అన్ని మండలాల్లో రోడ్డు విస్తీర్ణం చేసేందుకు శ్రీకారం చుట్టడం గిరిజన సంఘం తరుపున స్వాగతిస్తున్నాము. అయితే కొంతమంది నాయకులు రోడ్డుకు ఇరువైపులా వున్న దుకాణాలు, గృహాలు వున్నా యజమానులు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి విస్తీర్ణం ఆపి అభివృద్ధికి అడ్డంకి పడుతున్నారు. ఈ సందర్భంగా అటువంటి నీచ నాయకులు చెపుతున్న విషయం ఏమిటంటే కోర్ట్ ఆదేశాలు మేరకు రోడ్డుకి ఇరువైపులా అటు 50 ఇటు 50 అడుగులు




సంబంధిత అధికారులు తీసేలా చర్యలు తీసుకోవాలని లేకుంటే ఉద్యమం చేపట్టడం ఖాయమని తెలిపారు.

# వరల్డ్ రికార్డు లక్ష్యంగా యోగ డే విజయవంతం చేయాలి

## - అగనంపూడి కాలేజీ ప్రిన్సిపాల్ సిమల క్రిష్ణవేణి





**అగనంపూడి, (రాజధాని వార్తలు):** అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన ప్రిన్సిపాల్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన సిమల క్రిష్ణవేణి ని ఇంటర్మీడియట్ సెకండియర్ స్టూడెంట్ జే హేమంత్‌కి షైనింగ్ స్టార్ ప్రతిభ పురస్కారం పొందుట వల్ల వారిని ఏడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, 79వ వార్డు తెలుగు మహిళ నాయకురాలు గొల్లవిల్లి కనక భవాని, విశాఖ జిల్లా లైన్స్ క్లబ్ చైర్ పర్సన్ కడిమి హనుమంతరావు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం యోగాంధ్ర పై జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ సిమల క్రిష్ణవేణి మాట్లాడుతూ నేను శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస నుండి బదిలీపై అగనంపూడిలో కాలేజీలో చేరితిని గతంలో వలె ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు కాలేజీ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. జూన్ 21వ తేదీన ఆర్కే బీచ్‌లో జరిగే యోగ డేలో అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల భాగస్వామి అవుతారని అన్నారు. కనక భవాని, కడిమి హనుమంతరావు మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం మన విశాఖలో జరగడం గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ యోగా దినోత్సవంకి వస్తున్నందున సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టాకరంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారని కావున రాజకీయాల అతీతంగా అందరూ మరియు స్వచ్ఛంద సంస్థలు పాల్గొకోవాలని పిలుపునిచ్చారు. ఓం శాంతి బికే రామకోటి మాట్లాడుతూ విద్యార్థులు తప్పకుండా ప్రతి ఒక్కరూ ఉన్నతమైన లక్ష్యము పెట్టుకోవాలి అలాగే విలువలతో కూడి జీవితం పొందాలి దానికి విధిగా యోగా చేయాలి నిత్యం సాధన చేయడం ద్వారా ద్వారా ప్రతి ఒక్కరూ జీవితం ఆరోగ్య దాయకంగా ఆనందదాయకంగా ఉంటుందని అన్నారు. ఏడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ సభ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు డి దివ్య ఎం శ్రీదేవి జాజుల సూర్య ప్రదీప్ సిహెచ్ నాగేంద్ర సిహెచ్ ఆదినారాయణ అనురాధ ఎల్ నాగేశ్వరరావు హుస్సేన్ శివ దయాల్ మరియు ఓం శాంతి ప్రతినిధి కోట్ని నరసింహమూర్తి మరియు కాలేజీ స్టూడెంట్స్ పాల్గొన్నారు. అనంతరం కాలేజీ ప్రాంగణంలో ఓం శాంతి రామ్ భరత్ కుమార్ ఆధ్వర్యంలో యోగ ఆసనాలు సాధన చేయించారు.

# 84వ వార్డ్ కొప్పాకలో రూ. 50 లక్షలతో సిమెంట్ రోడ్లు, కాలువలు : మాదంశెట్టి నీలబాబు



**విశాఖ, (రాజధాని వార్తలు):** 84వ డివిజన్‌లో కార్పొరేటర్ చిన్నతల్లి నీలబాబు జీవీఎంసీ సమావేశంలో మంజూరు చేసిన నిధులతో కొప్పాక వీలైన గ్రామాల్లో 50 లక్షలు నిధులతో ప్రజలు అభ్యర్థనపై సిమెంట్ కాలువలు, సిమెంట్ రోడ్లు పనులు ప్రారంభమయ్యాయని, ఈరోజు ఉదయం నీలబాబు కొప్పాక గ్రామం పర్యటించి పనులు జరుగుతున్న నాణ్యత ప్రమాణాలు ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారని, అవినీతికి ఎక్కడా తావు లేకుండా పనులు జరగాలని, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు నీలబాబు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బోయిన మురళి వానపల్లి బాబురావు గోపి బాలాజీ చిన్న తదితరులు పాల్గొన్నారు.



**పాత శ్రీకాకుళంలో 10 ఏళ్లకు ఒకసారి జరిగే పెద్దమ్మ తల్లి, నూకాలమ్మ తల్లి సిరిమానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ పండగలు, సిరిమానోత్సవంకు విచ్చేసిన గౌరవ కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్, నాయకులు**

# సూపర్ సిక్స్‌లో మరో ముఖ్యమైన హామీకి సిఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా రేపు తల్లులకు కానుకగా తల్లికి వందనం. రేపే తల్లికి వందనం నిధులు విడుదలకు కూటమి ప్రభుత్వ నిర్ణయం. 67 లక్షల మందికి తల్లికి వందనం పథకం నిధులు రేపు ఖాతాల్లో జమ చేయనున్న ప్రభుత్వం. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ తల్లికి వందనం ఇస్తామన్న మేనిఫెస్టో హామీ మేరకు పథకం అమలుకు నిర్ణయం. 67,27,164 మంది విద్యార్థులకు పథకం వర్తింపు. తల్లికి వందనం పథకం కింద రేపు తల్లుల ఖాతాల్లో రూ. 8745 కోట్లు జమ చేయనున్న ప్రభుత్వం. 1వ తరగతిలో అడ్మిషన్ పొందే పిల్లలు, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేరే విద్యార్థులకు కూడా తల్లికి వందనం అమలు. అడ్మిషన్లు పూర్తయ్యి డేటా అందుబాటులోకి రాగానే ఆ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమ. విధి విధానాలను ఖరారు చేస్తూ నేడు జీ.వో విడుదల. సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్, మెగా డీఎస్సీ, దీపం-2 పథకాలు అమలు చేసిన ప్రభుత్వం.

# మార్కెట్ యార్డు పునర్నిర్మాణంపై ప్రజల డిమాండ్

## - మూడు మండలాల రైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వానికి పరీక్ష



**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండలాల గిరిజన రైతులు చింతపల్లి మార్కెట్ యార్డ్ అభివృద్ధిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పదే పదే పాలకవర్గాలు మారినా, నాయకులు మారినా..మార్కెట్ యార్డులో అభివృద్ధి మాత్రం శూన్యంగానే కొనసాగుతోందని రైతులు వాపోతున్నారు. గతంలో మావోయిస్టుల చేతిలో ధ్వంసమైన మార్కెట్ యార్డు ఇప్పటికీ శిథిలంగా మిగిలిపోయింది. కూలిపోయిన భవనాలు, పాడుబడిన నిర్మాణాలు, కనీస సమావేశాలకైనా సదుపాయాల్లేని పరిస్థితి అక్కడ గల ప్రాంతీయ రైతుల ఆవేదనను పెంచుతోంది. పదవులు చేపట్టిన మార్కెట్ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు భవనాల పురోగతిపై పటిష్ట చర్యలు తీసుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ మార్కెట్ యార్డుకు నిధులు మంజూరవుతున్నాయా...? మంజూరైతే అవి ఎలా వినియోగమవుతున్నాయన్నది గిరిజన రైతులకు ప్రశ్నగా మారింది. గడచిన ఆరు దశాబ్దాల్లో గిరిజన పంటల ప్రోత్సాహానికి, రైతుల అవగాహనకు ఒక్క కార్యక్రమం కూడా జరగలేదని వాపోతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి చేస్తామని హామీలు ఇచ్చిన పాలకవర్గం, వర్షానికి కారుతున్న షెడ్లకు సైతం మరమ్మత్తులు చేయకపోవడం గిరిజన రైతుల్లో మరింత నిరాశను నింపుతోంది. శిథిల దశకు చేరిన చింతపల్లి మార్కెట్ యార్డును పునర్నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం చొరవ చూపి, మార్కెట్ కమిటీకి నిష్క్రియంగా ఉన్న అధ్యక్ష, ఉపాధ్యక్షుల స్థానాల భర్తీ జరిపి, మూడు మండలాల గిరిజన రైతులకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan